అంబర్‌పేటకు స్పెషల్ ఫండ్

- రూ. 10 కోట్లు మంజూరు
- నియోజకవర్గంలో రూ. 5 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి పొన్నం

నల్లకుంట/బర్కత్‌పుర, రాంనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రూ. 10 కోట్ల నిధులను స్పెషల్ ఫండ్ కింద విడుదల చేశారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ నిధులతో నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం నల్లకుంట, కాచిగూడ, బాగ్‌అంబర్‌పేట డివిజన్లలోని పలు ప్రాంతాలలో రూ. 5 కోట్ల వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులను మాజీ ఎంపీ వి.హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. నల్లకుంట డివిజన్ సంజీవ్ గాంధీనగర్‌లో రూ. 31 లక్షల వ్యయంతో గ్రౌండ్ ప్లస్ టూతో కమ్యూనిటీహాల్ నిర్మాణం, తిలక్ నగర్ గాంధీ బొమ్మ వద్ద గల లైబ్రరీ పై రూ. 29.50 లక్షల వ్యయంతో మరొక అంతస్తు నిర్మాణం, మయూరి వీధిలో రూ. 36 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, కాచిగూడ డివిజన్ బర్కత్‌పుర చమన్ వద్ద రూ. 21 లక్షల వ్యయంతో సివరేజీ పైప్‌లైన్, కుత్బీగూడలో రూ. 20.25 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, రెడ్డి కళాశాల వద్ద రూ. 48.60 లక్షల వ్యయంతో సివరేజీ పైప్‌లైన్, సీసీ రోడ్డు నిర్మాణం, బాగ్‌అంబర్‌పేట డివిజన్ సీతకాలనీలో రూ. 9 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, మందుల బస్తీలో రూ. 17 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, పాముల బస్తీలో రూ. 15 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, మల్లికార్జున్ నగర్‌లో కమ్యూనిటీ హాల్ మరమ్మతుకు రూ. 8 లక్షలు, మల్లన్న ఆలయం వద్ద రూ. 10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, కుమ్మరబస్తీలోని మైసమ్మ ఆలయం వీధిలో రూ. 19 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులు, సోమసుందర్ నగర్‌లో రూ. 29 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలతో ముందుకెళ్తుందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ విధ్వంసమైందని ఆరోపించారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధికి సహకరించడం లేదని విమర్శించారు. అభివృద్ధికి సహకరించాలని హితవుపలికారు. రాష్ట్రానికి సంబంధించిన నిధులను కేంద్రం నుంచి మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, మాజీ కార్పొరేటర్లు గరిగంటి శ్రీదేవి రమేష్, పులి జగన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మోతె రోహిత్, కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి ఎం.మహేష్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.



బాగ్‌అంబర్‌పేటలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ వీహెచ్, రోహిణ్‌రెడ్డి, శంభుల ఉషశ్రీ తదితరులు

మంత్రి పర్యటనలో ప్రొటోకాల్ పాటించలేదు

- కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, వై.అమృత

బర్కత్‌పుర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో గురువారం పలు డివిజన్లలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించిన అభివృద్ధి పనులలో ప్రొటోకాల్ పాటించలేదని బీజేపీ కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, వై. అమృత ఆరోపించారు. తమకు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సమాచారం ఇవ్వలేదని ఇంజనీరింగ్ విభాగం సూపరింటెండెంట్ మల్లారెడ్డి ఫిర్యాదు చేశారు. దీనిపై మల్లారెడ్డి స్పందిస్తూ.. ప్రొటోకాల్ తప్పనిసరిగా పాటిస్తామని, స్థానిక సిబ్బంది వల్ల సమాచారం అందలేదని, మరోసారి ఈ విధంగా జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కన్నె రమేష్‌యాదవ్, బల్వీర్, ప్రశాంత్‌జోషి, కృష్ణకుమార్, క్షీరసాగర్, సుభాష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను ఆహ్వానించకపోవడం ప్రొటోకాల్ ఉల్లంఘనేనని బీఆర్ఎస్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు సిద్దార్థ ముదిరాజ్ అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకపోవడం శోచనీయమన్నారు.



ఇంజనీరింగ్ విభాగం సూపరింటెండెంట్ మల్లారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, వై. అమృత తదితరులు



కచ్చా నాలలో అక్రమంగా కలిపిన డ్రైనేజీ పైపులైన్

కచ్చా నాలాలో అక్రమంగా డ్రైనేజీ పైపులైన్

- స్థానికుల ఫిర్యాదు.. తొలగించిన జీహెచ్ఎంసీ అధికారులు

ముషీరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కచ్చా నాలాలో అక్రమంగా డ్రైనేజీ పైపులైన్‌ను కలపడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. గంగపుత్ర కాలనీ 44 బస్టాప్ వద్ద కచ్చా నాలాలో భవన యజమాని డ్రైనేజీ పైప్‌లైన్‌ను కలపడంతో స్థానికులు జీహెచ్ఎంసీ అధికారులకు గురువారం ఫిర్యాదు చేశారు. భవిష్యత్‌లో సమస్యలు ఉత్పన్నమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఈ మురళి, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ దాసు, సిబ్బంది అక్కడకు చేరుకొని పైపులైన్‌ను తొలగించారు. ఏఈ మాట్లాడుతూ.. భవన యజమానిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సొసైటీ, ట్రస్టు ఆధ్వర్యంలో హెబ్రోన్ చర్చి నిర్వహణ

చిక్కడపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): హెబ్రోన్ చర్చి ప్రతిష్ఠను కాపాడడంలో చర్చి సొసైటీ, ట్రస్టు సమైక్య కృషి కొనసాగుతుందని చర్చి సొసైటీ అధికార ప్రతినిధి రాగి వీరాచారి స్పష్టం చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు 25 మంది చర్చి విషయంలో చట్ట వ్యతిరేకంగా చేస్తున్న కార్యక్రమాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం తుది తీర్పువెలువరించే వరకు చర్చి నిర్వహణలో ఎలాంటి జోక్యం చేసుకోవద్దని వారిని హెచ్చరిస్తూ తీర్పు ఇచ్చిందని తెలిపారు. తనపై 32 కేసులున్నాయని, తప్పించుకు తిరుగుతున్నానని అద్దంకి ఇమ్మాన్యుయేల్, మ్యాథ్యూస్ అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. రెండు కేసులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. హెబ్రోన్ చర్చి ప్రతిష్ఠకు ఎవరు భంగం కలిగించినా ఉపేక్షించబోమని వీరాచారి హెచ్చరించారు. కొంతకాలంగా చర్చి నిర్వహణలో సొసైటీ, ట్రస్టు మధ్య ఉన్న విభేదాలకు స్వస్తి పలుకుతూ ఇరువర్గాలు కలిసి కోర్టు ఉత్తర్వుల మేరకు చర్చిని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. సమావేశంలో పాస్టర్లు, చర్చి సభ్యులు పాల్గొన్నారు.



హార్టికల్చర్ విభాగం మేనేజర్‌తో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

పార్కుల సుందరీకరణ, అభివృద్ధిపై కార్పొరేటర్ సమీక్ష

చిక్కడపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని పార్కుల సుందరీకరణ, అభివృద్ధి ప్రణాళికపై కార్పొరేటర్ ఎ. పావనివినయ్‌కుమార్ జీహెచ్ఎంసీ హార్టికల్చర్ విభాగం మేనేజర్ ఆశిష్‌కుమార్‌తో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

అకౌంటెంట్ నిర్వచనంలో కాస్ట్ అకౌంటెంట్‌ను చేర్చాలి



సమావేశంలో పాల్గొన్న డాక్టర్ లావణ్య కందూరి, మూర్తి, ఖాజాజలాలుద్దీన్

కవాడిగూడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అకౌంటెంట్ నిర్వచనంలో కాస్ట్ అకౌంటెంట్‌ను చేర్చాలని ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ చైర్‌పర్సన్ డాక్టర్ లావణ్య కందూరి, కేంద్ర మండలి సభ్యులు డాక్టర్ కేసీహెచ్, ఏవీఎస్ఎన్ మూర్తి, హైదరాబాద్ చాప్టర్ కార్యదర్శి ఖాజా జలాలుద్దీన్ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం దోమలగూడలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పన్ను విధానం, అనుసరణ, వ్యయ నియంత్రణ, ఆర్థిక వ్యూహాత్మక ప్రణాళిలు వంటి ముఖ్యమైన రంగాలను, రాష్ట్ర అకౌంటెంట్ల నైపుణ్యాన్ని గుర్తించాలని కోరారు. 2013 కంపెనీల చట్టం ప్రకారం అంతర్గత ఆడిటర్లుగా కాస్ట్ అకౌంటెట్లు అర్హత పొందినట్లు గుర్తు చేశారు.



అవార్డులు అందుకున్న విద్యార్థులతో నర్సింహారెడ్డి, అశోక్‌కుమార్, సత్యనగేష్, మల్లం రమేష్ తదితరులు

ఐబీఓ విజేతలకు బహుమతుల ప్రదానం

చిక్కడపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో విజేతలైన రెండు తెలుగు రాష్ట్రాల వారికి బహుమతులను గురువారం త్యాగరాయ గానసభలో ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న టీయూఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రతిభ వెలుగులోకి రావాలంటే పోటీలు ఉండాల్సిందేనన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, కరస్పాండెంట్‌లకు అవార్డులు బహూకరించారు. కళారత్నం మల్లం రమేష్, సినీనటులు అశోక్‌కుమార్, జెన్నీ, ఘర్షణ శ్రీనివాస్, ప్రముఖ సైకాలజిస్ట్ బీవీ సత్యనగేష్ తదితరులు పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న కుమారి వేద

కుమారివేదకు కీర్తిపద్మ పురస్కారం ప్రదానం

రాంనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చేనేత కళా వెలుగులు, కవి సమ్మేళనం కార్యక్రమంలో కూచిపూడి నాట్యంలో మాస్టర్ డిగ్రీ చేసిన నాట్య కళాకారిణి కుమారి వేదకు కీర్తిపద్మ పురస్కారం లభించింది. గురువారం అఖిల భారతీయ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుమ్మ సత్యనారాయణ, ఎస్.రవికుమార్, జె.బి.రాజు, అమృత్‌కుమార్‌జైన్, రామకృష్ణ చంద్రమౌళి ఆమెకు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు కీర్తిపద్మ పురస్కారం లభించడం ఆనందంగా ఉందన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి మహిళల పక్షపాతి

టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్

కవాడిగూడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం, రాష్ట్రం ప్రగతి సాధిస్తాయని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళల పక్షపాతి అని టీపీసీసీ అధికారప్రతినిధి అద్దంకి దయాకర్ అన్నారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో మహిళలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గురువారం దోమలగూడలోని ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న అద్దంకి దయాకర్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి క్రీడా పోటీలను ప్రారంభించారు.

దయాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ సాధనలో గెజిటెడ్ ఉద్యోగుల పాత్ర మరువలేమన్నారు. లింగ సమానత్వంపై ప్రతి ఇంట్లో అవగాహన ఉండాలని సూచించారు. మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రితో సమావేశం ఏర్పాటు చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అద్దంకి దయాకర్ సతీమణి నాగమణి, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి ఏ. సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు బి. శ్యామ్, మహిళా విభాగం చైర్‌పర్సన్ డాక్టర్ దీపారెడ్డి, కన్వీనర్ ఉదయ సుజాత, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాము, మేడ్చేల్, మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దయాకర్ దంపతులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.



అద్దంకి దయాకర్ దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

కాచిగూడ సీఐ చంద్రకుమార్ ఆకస్మిక బదిలీ

బర్కత్‌పుర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ పీఎస్ సీఐ కె.చంద్రకుమార్ ఆకస్మికంగా బదిలీ అయ్యారు. సీపీ సీవీ ఆనంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రకుమార్ 2024 జూలైలో కాచిగూడ సీఐగా బాధ్యతలు చేపట్టారు. కేవలం 9 నెలల్లోనే బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది. ఆయనను మెయిన్ పోలీస్ కంట్రోల్ రూమ్‌కు బదిలీ చేశారు. సెంట్రల్ జోన్‌లో డబ్ల్యూపీఎస్ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న జ్యోత్స్న తాల్లోజును కాచిగూడ సీఐగా నియమించారు.

రేపు ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఇఫ్తార్ విందు



మాట్లాడుతున్న అఫ్జల్ సలీం

కవాడిగూడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఈనెల 8వ తేదీన ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నామని ఆ పార్టీ మైనారిటీ విభాగం రాష్ట్ర నాయకుడు అఫ్జల్ సలీం తెలిపారు. లిబర్టీ సమీపంలోగల ఆప్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులమతాలకు అతీతంగా అందరూ ఇఫ్తార్ విందులో పాల్గొనాలని కోరారు. ఆప్ నాయకులు నర్సింగ్ యమునాగౌడ్, లక్ష్మనాయుడు, అజీమ్‌బేగ్, షాబాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి

- డాక్టర్ జె. అచ్యుతాదేవి

బర్కత్‌పుర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణ కోసం విద్యార్థినులు కరాటే నేర్చుకోవాలని రెడ్డికళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. అచ్యుతాదేవి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన సెల్ఫ్ డిఫెన్స్ కోర్సు శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి, సెల్ఫ్‌డిఫెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ అమృతారెడ్డి, డాక్టర్ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



కరాటే శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థినులతో రెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. అచ్యుతాదేవి తదితరులు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ముషీరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సెయింట్ పాయిస్ జూనియర్ కాలేజీలో 588 విద్యార్థులు పరీక్షలు రాయల్సి ఉండగా 9 మంది గైర్హాజరయ్యారు. బాగ్‌లింగంపల్లి అంబేడ్కర్ కాలేజీలో 487 మంది పరీక్షలు రాయల్సి ఉండగా 13 గైర్హాజరయ్యారు. చిక్కడపల్లిలోని అరోరా జూనియర్ కాలేజీలో 410 మంది పరీక్ష రాయాల్సి ఉండగా ఏడుగురు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించారు.

ఉద్యమకారుల ఆకాంక్షలను ప్రభుత్వం నెరవేర్చాలి

- జేఏసీ చైర్మన్ సుల్తాన్‌యాదగిరి

రాంనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉద్యమకారుల ఆకాంక్షలను ప్రభుత్వం నెరవేర్చాలని, ఉద్యమ జర్నలిస్టులకు ప్రభుత్వం 200 గజాల స్థలం కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్‌యాదగిరి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ జర్నలిస్టు ఉద్యమకారుల సమావేశం జేఏసీ నాయకుడు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగస్వామ్యమైన జర్నలిస్టులకు బీఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. జేఏసీ సెక్రటరీ జనరల్ ప్రఫుల్ రాంరెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రతి జర్నలిస్టుకు నెలకు రూ. 10 వేల ఆర్థిక సహకారం అందించాలన్నారు. సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ ఎం.ఏ.షోయబ్ మాట్లాడారు. జేఏసీ నాయకులు ప్రసాద్, బి.శ్రీనివాస్, అఖిలేష్, నర్సింహ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుల్తాన్ యాదగిరి

ఏపీ సీఎం చంద్రబాబుపై హరీష్‌రావు ఆరోపణలు విచారకరం

రాంనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పట్ల ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకు ప్రేమ లేదని, కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారని మాజీ మంత్రి హరీష్‌రావు చేసిన ఆరోపణలు విచారకరం అని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా అన్నారు. గురువారం పార్టీ నగర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడు తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవించి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు లేఖ రాశారని గుర్తు చేశారు. హైదరాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత ఆయనదేనన్నారు. టీడీపీ, చంద్రబాబుపై బురదజల్లే ప్రయత్నాలను బీఆర్ఎస్ నేతలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కిషోర్, బాల్‌రాజ్ గౌడ్, నాగు నగేష్, ప్రకాష్, శుక్లవేది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయిబాబా

కార్మిక కమిషనరేట్ ఆవరణలో మరో భవన నిర్మాణం

చిక్కడపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్ లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో మరో భవన నిర్మాణానికి శరవేగంగా పనులు జరుగుతున్నాయి. చెట్లను తొలగించి వారం రోజులుగా పనులు చేస్తున్నారు. కమిషనరేట్ భవనానికి ఎడమవైపు ఉన్న ఖాళీ స్థలంలో భవనాన్ని నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. ఈ విషయమై అదనపు కమిషనర్ డా. గంగాధర్‌ను సంప్రదించగా నూతన భవన నిర్మాణం పనులు జరుగుతున్న మాట వాస్తవమేనన్నారు. పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తామన్నారు.

వర్గీకరణ చట్టబద్ధతను అడ్డుకుంటున్న మంద కృష్ణ

- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

బర్కత్‌పుర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నేతకానీల భుజంపై తుపాకీ పెట్టి మాదిగలను మందకృష్ణ మాదిగ కాలుస్తున్నాడని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి ఆరోపించారు. బీజేపీకి ఇచ్చిన హామీ ప్రకారమే ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతను అడ్డుకుంటున్నాడని ధ్వజమెత్తారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా వర్గీకరణ చట్టబద్ధత ఆగదని స్పష్టం చేశారు.

గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రవి మాట్లాడుతూ మాజీ ఎంపీ నేతకాని వెంకటేష్ మంత్రి దామోదర రాజనర్సింహపై చేసిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. వర్గీకరణ చట్టబద్ధతకు సీఎం రేవంత్‌రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటే దానిని తట్టుకోలేక మందకృష్ణ నేతకాని కులస్థులను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. వర్గీకరణ చట్టబద్ధతపై తెలంగాణ వ్యాప్తంగా మాదిగల కృతజ్ఞత యాత్రలు నిర్వహిస్తున్నామని, పది రోజుల పాటు 33 జిల్లా కేంద్రాల్లో యాత్రలు కొనసాగుతాయని తెలిపారు.

వర్గీకరణ చట్టబద్ధత బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రోజున మండల, నియోజకవర్గ స్థాయిలో సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ సభలు, సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో అంబేడ్కర్ సంఘాల సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు రాములు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ మీసాల మల్లేష్, ఇన్‌చార్జి డాక్టర్ నర్సింహ మాదిగ, ఎన్‌డీఎస్ఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు బాబురావు, బోయిని ఎల్లేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి